ప్రజాశక్తి

శుక్రవారం 15 సెప్టెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పొత్తు ప్రకంపనలు

- జనసేన, టిడిపి కలిసి పోటీపై భేదం-మోదం
- వైసిపిలో దిగులు-గుబులు

2లో

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

జెడ్‌పి ఆస్తుల స్వాధీనానికి చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

జెడ్‌పి కార్యాలయంలోని హెచ్ సెక్షన్ అధికారులతో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గురువారం సమీక్షించారు. పెండింగ్ బకాయిలను వసూలులో అనుసరించాల్సిన విధివిధానాల గురించి చర్చించారు. కోర్టు కేసులు, జెడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ నుండి అద్దె వసూళ్లు, జెడ్పీ ఆస్తుల పరిరక్షణ, జెడ్పీ గెస్ట్ హౌస్‌ల పరిరక్షణ, వాటి నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కొన్నేళ్లుగా జెడ్‌పి ఆస్తుల్ని అన్యాయంగా ఆక్రమించి, వాటిని తమ ఆధీనంలో ఉంచుకొని వాటి అద్దెలు కూడా చెల్లించకుండా అనుభవిస్తున్న వారిపై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఆక్రమణకు గురైన జెడ్‌పి ఆస్తుల్ని స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పైరు మొత్తం నాశనం

- అయినా స్పందించని యంత్రాంగం
- పరిశీలించి పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలి : సిపిఎం

4పే





నియోజకవర్గం	వైసిపి	టిడిపి	జనసేన	విజేత ఆధిక్యత
తెనాలి	94495	76,846	29905	17649
పొన్నూరు	87,570	86,458	12303	1112
ప్రత్తిపాడు	92,508	85,110	26,371	7398
మంగళగిరి	1,08,464	1,03,127	10135 (సిపిఐ)	5337
తాడికొండ	86,848	82,415	4992 (బిఎస్‌పి)	4433
గుంటూరుతూర్పు	77047	54,956	21,508	22,091
గుంటూరుపశ్చిమ	67575	71864	27869	4289
చిలకలూరిపేట	94,430	86,129	2,958	8,301
నర్సరావుపేట	1,00,994	68,717	8,746	32,277
సత్తెనపల్లి	1,05,063	84,187	9,279	20,876
వినుకొండ	1,20,703	92,075	4,637	28,628
పెదకూరపాడు	99,577	85,473	7,198	14,104
గురజాల	1,17,204	88,591	7,198	28,613
మాచర్ల	1,10,406	88,488	12,503	21,918
రేపల్లె	78,420	89,975	11,761	11,555
బాపట్ల	79,836	64,637	4,006	15,199
వేమూరు	81,671	71,672	13,038	9,999

పొత్తు ప్రకంపనలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో టిడిపితో పొత్తుపెట్టుకుంటామని రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 2014లో టిడిపి, జనసేన, బిజెపి కలిసి పోటీచేయడం వల్ల అప్పట్లో ఉమ్మడి జిల్లాలో టిడిపి12 సీట్లు కైవసం చేసుకుంది. 2019 ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి వేర్వేరుగా పోటీ చేయగా జిల్లాలో టిడిపి ఘోరపరాజయం చవిచూసింది. కొన్ని నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులకు ఓట్లు భారీగా రాగా మరికొన్ని నియోజకవర్గాల్లో స్వల్పంగా ఓట్లు వచ్చాయి. ఈ మూడు పార్టీలు వేర్వేరుగా పోటీ చేయడం వల్ల మెజార్టీ నియోజకవర్గాల్లో వైసిపికి ఫలితాలు అనుకూలంగా వచ్చాయి. ఈసారి జనసేన, టిడిపి కలిస్తే తమకు నష్టమేనని వైసిపి నాయకులు అంగీకరిస్తున్నారు.

2019లో తెనాలి, పొన్నూరు, ప్రత్తిపాడు, గుంటూరుపశ్చిమ, గుంటూరు తూర్పు, రేపల్లే నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులకు ఓట్లు గణనీయంగా వచ్చాయి. జనసేన కలిసి ఉంటే తమ అభ్యర్థులు గెలిచి ఉండేవారని 2019 ఎన్నికల తరువాత టిడిపి నాయకులు వాపోయారు. జనసేనతో వామపక్షాలు, బిఎస్‌పి పొత్తు ఉండటం వల్ల 2019లో తాడికొండలో బిఎస్‌పి అభ్యర్థికి 4992 ఓట్లు, మంగళగిరిలో సిపిఐ అభ్యర్థి 10,135 ఓట్లు సాధించారు. జనసేన అభ్యర్థులు భారీగా ఓట్లు సాధించినా రేపల్లె, గుంటూరు పశ్చిమలో టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. మిగతా 15 నియోజక వర్గాల్లో వైసిపి ఓటమి పాలయింది.

నర్సరావుపేట లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయారు. అప్పట్లో వైసిపి అభ్యర్థులు భారీ ఆధిక్యతతో గెలుపొందారు. నర్సరావుపేట పార్లమెంటు పరిధిలో గత ఎన్నికల్లో జనసేన ప్రభావం తక్కువగా ఉండటం వల్ల ఈ జిల్లాలో వచ్చే ఎన్నికల్లో పోటీకి ఆపార్టీ సిద్ధపడటంలేదని తెలిసింది. జనసేన టిడిపి కలిసి పోటీ చేస్తే వైసిపి వ్యతిరేక ఓటు ఈ కూటమికి దక్కుతుందని కానీ బిజెపితో కలిస్తే మాత్రం టిడిపికి భారీ నష్టం ఉంటుందనే అభిప్రాయం టిడిపి సీనియర్లలో వ్యక్తమవుతోంది. వైసిపికి ఉన్న ఓటు బ్యాంకులో మెజార్టీ ఓట్లు బిజెపిని వ్యతిరేకించే ఓటర్లు అధికంగా ఉన్నారు. అయితే వైసిపి ప్రభుత్వ విధానాలపై అసంతృప్తిగా ఉన్న వారు వెంటనే తమ వ్యతిరేకతను వ్యక్తం చేయాలంటే టిడిపి, జనసేన, వామపక్షాల వైపు మొగ్గుచూపే అవకాశం ఉంది. బిజెపితో టిడిపి పొత్తు ఉంటే మాత్రం వ్యతిరేక ఓట్లు యథాతథంగా వైసిపికి లేదా ఇతర పార్టీలకు వెళ్లే అవకాశం ఉంటుంది. దీనివల్ల టిడిపికి రాజకీయంగా ఉపయోగం ఉండదని చెబుతున్నారు.

టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తే గుంటూరు జిల్లాలో ఇప్పటికే తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తారని పవన్‌కల్యాణ్ ఇటీవల స్వయంగా ప్రకటించారు. గుంటూరు నగరంలో కూడా ఒక సీటు జనసేన కోరే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే జనసేనతో పొత్తు వల్ల తమకు దక్కాల్సిన సీట్లను కోల్పోయే ప్రమాదం ఉందని టిడిపి నేతలు మధనపడుతున్నారు. నాదెండ్ల మనోహర్ అభ్యర్థిత్వం ఖరారైతే మాజీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మరో నియోజకవర్గం వెళ్లాల్సి రావచ్చు. దీంతో ఆయన వర్గీయులు కొంత గందరగోళంలో ఉన్నారు. కోస్తా జిల్లాల్లోనే జనసేన ఎక్కువ సీట్లు అడుగుతుందని ఇందులో భాగంగా గుంటూరు జిల్లాలోనే మరో సీటు కూడా అడుగుతుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా గురువారం గుంటూరు, పల్నాడు జల్లాలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. గుంటూరు జిల్లా తెలుగుయువత ఆధ్వర్యంలో స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో నిరాహారదీక్షలు చేపట్టారు. జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కష్ణ, టిడిపి నాయకులు కోవెలమూడి రవీంద్ర నాని, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, అర్బన్ టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్ ,నియోజకవర్గ టిడిపి పరిశీలకులు సింహాద్రి కనకాచారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన్ కష్ణ ,స్థానిక కార్పొరేటర్ మానం పద్మశ్రీ , సిపిఐ రైతు నాయకులు,మహిళలు ప్రజాసంఘాలు పెద్దసంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

శ్రమదోపిడీకి గురవుతున్న ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు

సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

స్కీమ్ వర్కుర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్ కార్యాలయంలో గురురవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా దాదాపుగా 10 లక్షల మందిపైగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, 60-70 వేలుకు పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, లక్ష నుండి రెండు లక్షల వరకు స్కీమ్ వర్కర్స్ ఉన్నారని చెప్పారు. వీరెవరికీ చట్ట ప్రకారం వేతనాలు అమలు కావడం లేదని అన్నారు. వీరికి అనేక హామీలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా పాదయాత్ర చేసిన సందర్భంలో ఇచ్చారని, పర్మినెంట్ చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు 10200 మందినే పర్మినెంట్ చేస్తామంటూ నాలుగున్నరేళ్ల తర్వాత చెబుతున్నారని, ఇది మోసమని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీం కోర్టు తీర్పు అమలుకు నోచడం లేదని, అత్తెసరు జీతాలతో ఉద్యోగులు, స్కీమ్ వర్కులు కాలం గడుపుతున్నారని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని 7వ వేతన సంఘం చెప్పిందని, అయితే ఇప్పటికీ రూ.10-12 వేలే వస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు, కార్మికులు చేసే పోరాటాలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా తమ పూర్తి మద్దతు, ఉంటుందని, తామూ పోరాడతామని చెప్పారు. సదస్సులో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, నాయకులు ఎన్.రమేష్, టి.ఉమాశంకర్, ఎంవి సుకన్య, ఎం.లక్ష్మి, ఎస్‌కె.రిజ్వానా, పి.భూషమ్మ, డి.అనురాధ, సిహెచ్ గిరి, లవకుమార్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరావు, రామ్‌బ్రహ్మాచారి, భవాని పాల్గొన్నారు.

మంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఆ భూములపై నిగ్గు తేల్చాలి : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

బ్రాహ్మణపల్లి రెవెన్యూ జాలలపాలెం వద్ద 175 ఎకరాల ప్రభుత్వ భూమి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కబ్జా చేశాడని, మంత్రి కారుమూరు నాగేశ్వరరావుకు చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షంతో థర్డ్ పార్టీ ఏజెన్సీ నుండి సర్వే చేయించి పేదలకు పంచాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. లోకాయుక్తకు రెవెన్యూ జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన నివేదికలో 175 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని, కుంట, అడవి, చెరువు, జాగీర్‌దారుల మాన్యం, ప్రభుత్వ అసైన్డ్ భూములున్నాయని నిర్ధారించారని చెప్పారు. బియ్యం, మట్టి మాఫియా కింగ్‌ను పక్కన పెట్టుకుని బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని మంత్రి చెప్పడం విడ్డూరమన్నారు. నియోజకవర్గంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తూ టన్నుకు రూ.10-15 వేలు వసూలు చేసి కోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. వేల ట్రక్కుల మట్టిని ఎమ్మెల్యే అక్రమంగా తరలించుకున్నారని ఆరోపించారు. రేషన్ ద్వారా కందిపప్పు ఇవ్వలేని అసమర్ధ ప్రభుత్వమన్నారు. సమీక్షలే గాని నిధులివ్వడం లేదని విమర్శించారు. టిడిపి హయాంలో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ఇంటింటికీ కుళాయిలు ఇవ్వాలన్నారు.

రైతు సమస్యలపై తక్షణమే స్పందించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం తాడేపల్లి, రాజధాని మండల కమిటీల సమావేశం గురువారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగింది. సమావేశానికి రైతు సంఘం తాడేపల్లి కార్యదర్శి మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు రావేమోనని ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులను హితోధికంగా ఆదుకుని సాయం చేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులు తీసుకున్న పంట రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంట పొలాలపై మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. రైతులకు ఇది గుదిబండగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విధానం వల్ల రైతులకు నష్టంలేదని ప్రభుత్వం చేస్తున్న వాదన సరైనది కాదన్నారు. గ్యాస్ బండ సబ్సిడీపై కూడా గతంలో ప్రభుత్వాలు ఇలాగే చేశాయని, తరువాత సబ్సిడీ మొత్తం ఎత్తేవేసిన సంగతి కళ్ల ముందు కనబడుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మూడు నల్లచట్టాలు తీసుకొచ్చిన సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో రైతాంగ

మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. మంగళగిరి నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న కొండవీటి వాగు మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువను కూడా బాగు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు ఆర్‌బికె కేంద్రాల వద్ద అర్జీలు ఇవ్వాలని, 2022-23లో రైతుల రుణాలు రద్దుచేయాలని, 25వ తేదీ ఎంఆర్‌ఒ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని, 22, 23 తేదీల్లో తెనాలిలో జరిగే శిక్షణలో రైతులు పాల్గొనాలని తీర్మానించారు. ఈ సమావేశంలో బి.శివారెడ్డి, డి.గోపాల్‌రెడ్డి, ఎస్‌కె పీరూసాహెబ్, డి.వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, పి.వీరాస్వామి, డి.గోపాలరావు, సుబ్బారావు, బక్కిరెడ్డి, ఎ.రామారావు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-తాడేపల్లి

నిత్యం రద్దీగా ఉండే ఉండవల్లి సెంటర్ స్క్యూబ్రిడ్జి నుంచి బకింగ్ హోమ్ కెనాల్‌లో గుర్తు తెలియని యువతి దూకి ఆత్మహత్య చేసుకుంది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనను చూసిన స్థానికులు ఆమెను కాపాడటానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. మృతిచెందిన యువతి వయసు సుమారు 20 సంవత్సరాలు ఉంటుంది. యువతి ఒంటిపై రెడ్ కలర్ పంజాబి డ్రస్ ఉంది. సంఘటనా స్థలాన్ని తాడేపల్లి సిఐ శేషగిరిరావు పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగు పెడతామని బంగారంతో ఉడాయించారు..

ప్రజాశక్తి -గుంటూరు సిటీ

బంగారానికి మెరుగుపడతామంటూ బంగారం తీసుకుని ఉడాయించిన సంఘటన నగరంలోని పండరీపురంలో చోటుచేసుకుంది. పట్టాభిపురం ఎస్ఐ పథ్వి తెలిపిన వివరాల ప్రకారం గురువారం 9 గంటల సమయంలో పండరీపురం 5 లైన్ లో నివాసం ఉంటున్న బొలిశెట్టి రమేష్ చంద్రగుప్త కుటుంబ సభ్యుల వద్దకు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న వెండి బంగారు ఆభరణాలకు మెరుగులు పెడతామని చెప్పారు. ఇంట్లో ఉన్న 25 తులాల బంగారు ఆభరణాలను రైస్ కుక్కంలో వేశారని పది నిమిషాల తర్వాత చూసుకోవాలని పొడి బట్టతో శుభ్రం చేసుకోవాలని చెప్పి వెళ్లిపోయారు. వారు వెళ్ళిన తర్వాత కుక్కర్ మూత తీసి చూడగా అందులో వేసిన బంగారం మాయమైందని దీంతో మోసపోయామని గ్రహించి పట్టాభిపురం పోలీస్ స్టేషన్ కు వచ్చి రమేష్ చంద్రగుప్త ఫిర్యాదు చేశాడని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్వాడీలకిచ్చిన హామీలు నెరవేర్చలేదు

ప్రజాశక్తి తెనాలి

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ అన్నారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం అంగన్వాడీల మహాసభ నిర్వహించారు. సమస్యల పరిష్కారంపై శాంతియుతంగా ఎన్ని వినతి పత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించడం లేదని, పోరాటాలకు సిద్ధం కావాలని నేతాజీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెనాలి ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులుగా అనురాధ, ప్రధాన కార్యదర్శిగా ఏవిఎన్ కుమారి, గౌరవాధ్యక్షులుగా హుస్సేన్ వలి, మరో 13 మంది కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. కార్యక్రమంలో నాయకులు రంగ పుష్ప, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, ఎవిఎన్ కుమారి, అనురాధ, నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

కార్మికవర్గ పక్షపాతి పర్సా

ప్రజాశక్తి-తాడేపల్లి :కార్మిక వర్గ ప్రయోజనాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ధన్యజీవి పర్సా సత్యనారాయణ అని సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఘనంగా నివాళు లర్పించారు. గురువారం రాత్రి తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్ సిఐటియు కార్యాలయంలో జరిగిన పర్సా సత్యనారా యణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిం చిన సభకు కె.బాబురావు అధ్యక్షత వహించారు. నేతాజీ మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి మూడు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించి వేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి బొగ్గు గనుల కార్మికుల కోసం పర్సా సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న వై నేతాజీ

అలుపెరగని పోరాటం నిర్వహించారని తెలిపారు. కార్మిక హక్కులను పరిరక్షించడం కోసం పోలీసులు జైళ్ల పాలు చేసినా అజ్ఞాతవాసం గడపాల్సి వచ్చినా అనేక ఆటుపోట్లు ఎదురైనా ఎక్కడా వెనుకంజ వేయ లేదని చెప్పారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా రాష్ట్ర కనీస వేతనాల బోర్డు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల సవరణ చేయలేదని మండిపడ్డారు. కార్యక్ర మంలో సిఐటియు నాయకులు కొట్టె కరుణా కర రావు, కె.బాబూరావు, కె.వెంగమ్మ, ఎన్.దుర్గారావు, కె.కృష్ణ, శౌరి బర్తులం, వెంకన్న, ఇ.నరసింహా రావు, ఇసుకపల్లి ఇస్సాకు, కోటేశ్వరమ్మ, జి.కొండయ్య, సంతో షం తదితరులు పాల్గొన్నారు.

హరిసర్వోత్తమరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

టిజెపిఎస్‌లో హరిసర్వోత్తమరావు జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో గురువారం గ్రంథాలయ ఉద్యమ పితామహులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 141వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేస్తాయన్నారు. హరిసర్వోత్తమరావు స్వాతంత్ర్య పోరాటంలో జైలుకి వెళ్లిన మొదటివ్యక్తి అని, రచయితగా, సాహితీవేత్తగా, వయోజనుల కోసం ఎన్నో పుస్తకాలు స్వయంగా రాసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. పేదరికంలో పుట్టినా చదువు మీద వున్న ఆసక్తితో కష్టపడి చదువుకుని, సమాజ చైతన్యం కోసం 'స్వరాజ్యం' అనే పత్రికను ప్రారంభించి స్వాతంత్ర్య ఉద్యమానికి చైతన్యం తెచ్చారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు.కార్యక్రమంలో గ్రంథాలయ శాఖాదిపతి బి.సాయికళ, వైస్. ప్రిన్సిపాల్ ఏ.బి.మురళిధర్, సురేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జెకెసిలో లీడర్‌షిప్ ట్రైనింగ్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజిలోని కామర్స్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులకు రెండ్రోజుల లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జె.మురళిమోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాల నిర్వహణలో కాలేజి ముందుంటుందన్నారు. గత 14 సంవత్సరాలుగా ముంబాయి రాయ్ ఫౌండేషన్ సహకారంతో ఈ క్యాక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా రాజీవ్‌కుమార్ లవ్, ఎగ్జిక్యూటివ్ బిహేవియరల్ లఫ్ స్కిల్ కోచ్, క్లారిస్సా జతాన్న, ఎంటర్‌ప్రెన్యూరల్ కోచ్ విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకోవటం, వాటిని సాధించుకోవటంపై, నైపుణ్యాల అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ కె.చరణ్‌చౌదరి, ఎ.వెంకటకృష్ణ, కె.వీణ, డైరెక్టర్ ఎస్‌ఆర్‌కె ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపిచంద్ పాల్గొన్నారు.

విద్యార్థుల్ని అభినందిస్తున్న డైరెక్టర్లు

ఫెన్సింగ్ పోటీల్లో ఎసిఎంఇ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

కాకినాడలో ఈనెల 12న జరిగిన ఏపి స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-10 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్-2023 లో ఎసిఎంఇ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని స్కూల్ డైరెక్టర్ సౌగంధ్‌కృష్ణ నందమూరి తెలిపారు. టీం విభాగంలో జోష్నిక, లక్ష్మీ కార్తీక్, నైనికారెడ్డి స్వర్ణపతకాలు, ఫాయిల్ విభాగంలో ఆరోహి, హస్ని, శాన్వి వెండిపతకాలు సాధించారన్నారు. అలాగే అండర్-10 వ్యక్తిగత విభాగంలో హస్ని స్వర్ణపతకం, ఆరోహి, శాన్వి, జోష్నిక, లక్ష్మీకార్తీక్, నైనిక, రిషాంక్ రజత పతకాలు సాధించారన్నారు. అండర్-12 హిప్పీ విభాగంలో బుల్యాకొండ, యోగ్నేశ్వరిలు వెండి, వ్యక్తిగత విభాగంలోనూ యోగ్నేశ్వరి వెండి పతకం, బ్యూలా కాంస్యపతకం సాధించిందన్నారు. ఈసందర్భంగా స్కూల్ డైరెక్టర్లు దీప్తి నందమూరి, సౌగంధ్‌కృష్ణ నందమూరి విద్యార్థులను, కోచ్ అశోక్‌ను అభినందించారు.

జిటి రోడ్డులో రియల్స్ ట్రెండ్స్ స్టోర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జిటి రోడ్డులో రిలయన్స్‌ట్రెండ్స్ స్టోర్ ప్రారంభించారు. నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తులతో ఈ స్టోర్ గుంటూరు నగర ప్రజలకు ఆకర్షిస్తుందని కంపెనీ ప్రతినిధి తెలిపారు. ఇక్కడ వినియోగదారుల అభిరుచికి తగినట్లుగా, అందుబాటు ధరల్లో, చెల్లించిన ధరకు అత్యధిక విలువ కలిగిన వస్త్రశ్రేణి అందుబాటులో ఉంటుందన్నారు. ఈ స్టోర్‌లో ఆధునిక ఉమెన్స్‌వేర్, మెన్స్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్ససరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక, గొప్ప షాపింగ్ అనుభవం కలుగుతుందన్నారు. స్టోర్ ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ఆఫర్ కింద రూ.3999లు షాపింగ్ చేస్తే రూ.249కి ఆకర్షణీయమైన బహుమతి పొందవచ్చని, అంతేకాకుండా రూ.3999ల కొనుగోలుపై వినియోగదారులు రూ.2వేల విలువైన కూపున్లు పూర్తి ఉచితంగా పొందవచ్చన్నారు. కావున నగర ప్రజలు ఈ స్టోర్‌ను వినియోగించుకోవాలని కోరారు.

పైరు మొత్తం నాశనం

- అయినా స్పందించని యంత్రాంగం
- పరిశీలించి పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి

ఇటీవల వర్షాలకు వాగు ఉధృతి పెరిగి పలు గ్రామాల్లో పైర్లు ముంపుబారిన పడ్డాయి. మండలంలోని నరుకుళ్లపాడు, ఎండ్రాయి, పెద్దమద్దూరు తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పైర్లు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ఆయా పొలాలను సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు గురువారం పరిశీలించారు. వాగు ఉధృతి కారణంగా నీరు పొలాల్లో చేరి మూడ్రోజులపాటు నిలిచాయని, దీంతో రైతులు సాగు చేసిన పత్తి, మిర్చి, ఇతర పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని సూరిబాబు చెప్పారు. రైతులు, కౌలురైతులు తీవ్రంగా నష్టపోయినా అధికారులు స్పందించలేదని, ఇప్పటికీ పొలాలను పరిశీలించడం గాని, నష్ట అంచనాలు రూపొందించడం గాని చేయలేదని విమర్శించారు. పంటల సాగుకోసం రైతులు ఇప్పటికే రూ.20 వేల వరకూ పెట్టుబడి పెట్టారని, కౌలురైతులు మరో రూ.20-30 వేలు కౌలు చెల్లించారని, పత్తి కాపుదశలో, మిర్చి, ఇతర పైర్లు 40 రోజుల దశలో ఉండగా వర్షాలతో వాగు పొంగి పొలాలను ముంచెత్తిందని తెలిపారు. గతంలోనూ పొలాలు ముంపుబారిన పడినా బాధిత రైతులకు పరిహారం అరకొరగానే ఇచ్చారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కలుగజేసుకోవాలన్నారు.

నరుకుళ్లపాడు - అమరావతి మధ్యలో దెబ్బతిన్న పత్తిపైరును పరిశీలిస్తున్న సూరిబాబు

రెండు నియోజకవర్గాలపై ఇన్‌ఛార్జి మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నియోజకవర్గాల్లో అభివృద్ధికి సహకారం అందిస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురజాల, మాచర్ల నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశాలు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రస్తావించిన అంశాలు, సమస్యలపై మంత్రి మాట్లాడారు. మాచవరం, తంగెడలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు చర్యల కోసం అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లో 22ఎ ల్యాండ్ జాబితా నిషేధిత భూముల తొలగించే విధానంలో అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గొట్టిముక్కలలో సుమారు 150 మందికి సంబంధించిన అసైన్‌మెంట్ భూముల కేటాయింపు చేపట్టాలన్నారు. దాచేపల్లిలో తొలివిడత 800 పట్టాలు త్వరగా అందించాలని చెప్పారు. మాడుగలలో 48 మందికి సంబంధించి సుమారు 80-90 ఎకరాలు అసైన్డ్ భూముల పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద వచ్చిన పలు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీల శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని, గురజాలలో 24 గంటలు విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

మాచర్ల నియోజకవర్గ స్థాయి సమీక్షలో మంత్రి మాట్లాడుతూ అనుమతులు లేని ప్రైవేట్ లే ఔట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు జగ్రివాగు వాటర్ స్కీంకు మరమ్మతులు చేసి పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరాకు ఆదేశించారు. జలజీవన్ మిషన్ పనులుకు త్వరగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై సంపూర్ణ నివేదిక అందుబాటులో ఉంచాలన్నారు. మాచర్లలో డిగ్రీ కాలేజికి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న పాలిటెక్నిక్ కాలేజి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసిస్ట్, డెంటిస్ట్ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరవనం ఏర్పాటు చేస్తామన్నారు. సమీక్షల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకరరెడ్డి, జెసి ఎ.శ్యాంప్రసాద్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గురజాల నియోజకవర్గ సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి

ముగ్గు కార్మికులకు తాగునీటి వసతీ కరువు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ముగ్గు మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన సమావేశానికి ఎన్.యలమంద అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా సరైన వేతనాలు లేవని, వాటిని పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని కోరారు. చట్టపరమైన సౌకర్యాలు అమలు కావట్లేదని, తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు సదుపాయాలను యాజమాన్యం కల్పించాలన్నారు. ఎండ వానల్లోనూ చెట్ల కిందే కార్మికులు విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోందని, మహిళా కార్మికులు బహిర్భూమికి వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తాగునీటి సదుపాయమూ యాజమాన్యం కల్పించడం లేదన్నారు. ఈ సమస్యలపై కార్మిక శాఖ తనిఖీలు చేయాలన్నారు. రెండేళ్లకోసారి జరిగే కూలిరేట్ల ఒప్పందం ముగియనున్న నేపథ్యంలో కూలిరేట్ల పెంపుదలకు యాజమాన్యాలు ముందకు రావాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు జయరాజు, కార్మికులు ఎన్.నాగేశ్వరరావు, పేరయ్య, నరసింహారావు, మురళి, షేక్ ఖాసిం, ఎ.వెంకటేశ్వర్లు, ఎన్.శ్రీను పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన వారిని అభినందిస్తున్న కరస్పాండెంట్ తదితరులు

షూటింగ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు కృష్ణవేణి విద్యార్థిని

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా: నెల్లూరు జిల్లా కావలిలో ఈనెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మండలంలోని కేశానుపల్లి పరిధిలోని కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని షేక్ కరిష్మా, తృతీయ సంవత్సరం విద్యార్థిని కావూరి శ్రీలత, ఎంఎఎం ఫార్మసీ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు షేక్ అఫ్రీన్, వల్లెబోయిన భార్గవి తృతీయ బహుమతి సాధించారు. షేక్ కరిష్మా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామరావు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను కళాశాల చైర్మన్ ఎం.రామశేషగిరిరావు, డైరెక్టర్ డి.శ్రావ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, విభాగధిపతులు జె.రవిశంకర్, ఎం.రాధిక, బి.ఫణిబాబు, ఎం.సితార అభినందించారు.

విద్యార్థులకు హిందీ పద్య పోటీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక 6వ వార్డులోని ఎంపియుపి స్కూల్ హ్యారిస్‌లో హిందీ దివస్ సందర్భంగా పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు హిందీ పద్య పోటీలు, డ్రాయింగ్ పోటీలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కౌన్సిలర్ సత్యవాణి హరి హాజరయ్యారు. విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు పటాన్ లాలూ ఖాన్, హిందీ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావును సన్మానించారు.

వివరాలు చెబుతున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి

డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గుండెకు శాశ్వత ఫేస్ మేకర్ అమరిక

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాల సంయుక్త కృషితో పల్నాడు ప్రాంతంలో మొట్టమొదటిసారిగా గుండెకు శాశ్వత ఫేస్ మేకర్ అమరిక విజయవంతంగా నిర్వహించినట్లు అంజిరెడ్డి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. పట్టణానికి చెందిన 77 ఏళ్ల సీతారవమ్మ తీవ్రమైన కడుపు నొప్పి, ఛాతి నొప్పితో తమ హాస్పిటల్‌కు రాగా పరీక్షలు నిర్వహించామని, ఆమెకు గుండె నిమిషానికి 30-36 మధ్యలోనే కొట్టుకోవడం గమనించామని తెలిపారు. పసరు సంచిలో రాళ్లు, చీము ఉన్నట్టుగా గుర్తించి సమస్యను కుటుంబ సభ్యులకు వివరించామని, వారి అనుమతితో 3 గంటల పాటు శ్రమించి శాశ్వత ఫేస్ మేకర్‌ను అమర్చామని వివరించారు. డాక్టర్ కోటా శబరి గిరీష్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాల్లోనే జరిగే ఈ శస్త్ర చికిత్సను పల్నాడు జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. తమ హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన వైద్య బృందంచే అన్ని వర్గాల ప్రజలకు, అన్ని వ్యాధులకు వైద్య అందిస్తున్నామని చెప్పారు. పల్నాడు, పరిసర పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలు తమ హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె

ప్రజాశక్తి - చిలకలూరిపేట : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకైనా సిద్ధమవుతామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లీశ్వరి అన్నారు. స్థానిక పండరిపురంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం అంగన్వాడీల సమావేశం నిర్వహించారు. మల్లీశ్వరి మాట్లాడుతూ తెలంగాణలో అంగన్వాడీలకు రూ.13,500 జీతం ఇస్తున్నారని, దానికి మించి ఇస్తామనే సిఎం హామీని నెరవేర్చుకోవాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలివ్వాలని, ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చులకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక యాప్‌లతో అంగన్వాడీలు పని చేయాల్సి వస్తోందని, అయితే వారికి ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు మాత్రం సరిగా లేక ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. హెల్పర్లకు ప్రమోషన్లలో నిబంధనలు అమలు కావడం లేదని, రాజకీయ జోక్యాలు ఎక్కువయ్యాయని తెలిపారు. ప్రతినెలా క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వడంతోపాటు పెండింగ్ డిఎ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జి.సావిత్రి, ఎ.పద్మావతి, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిత్యం పని చేయిస్తున్నా కనీస వేతనం కరువు

ప్రజాశక్తి - క్రోసూరు : ఆశా వర్కర్లతో వారాంతపు సెలవులూ లేకుండా 24 గంటలూ పని చేయిస్తున్నా కనీస వేతనం మాత్రం అమలు చేయడం లేదని ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి ఆవేదన వెలిబుచ్చారు. యూనియన్ మండల సమావేశం స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో జి.సీత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. శివకుమారి మాట్లాడుతూ ఎన్సీడీ సర్వేలు, వ్యాక్సిన్ క్యారియర్లను ఆశా వర్కర్లతోనే చేయిస్తున్నారని, వారి జాబ్‌చార్ట్‌లో లేని విధానాలను కొత్తగా తెచ్చి సచివాలయాల్లో సంతకాలు పెట్టాలంటున్నారని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలివ్వాలని, సగం జీతాన్ని పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. యూనియన్ జిల్లా నాయకులు సిహెచ్.కుమారి మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘటితంగా పోరాడాలన్నారు. ప్రస్తుతం రూ.10 వేల జీతం పోరాటా ఫలితమేనన్నారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి.కోటేశ్వరమ్మ, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె మెహరనున్నీశా, దుర్గాబాయి, ప్రధాన కార్యదర్శిగా జి.సీత, సహాయ కార్యదర్శులుగా టి.విజయలక్ష్మి, సిహెచ్ లక్ష్మీ, కోశాధికారిగా ఎం.త్రివేణి ఎన్నికయ్యారు.

ఘనంగా ఇందిరాదత్తు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల : కెసిపి సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు పుట్టినరోజు వేడుకలను స్థానిక కెసిపి సిమెంటు ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఫ్యాక్టరీ ఎదురుగా శేషాద్రి కేన్సర్ సెంటర్ - నర్సరావుపేట సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వందలమంది పరీక్షలు చేయించుకున్నారు. కెసిపి అధికారులు, కార్మికులు సంస్థ పరిసరాల్లో మొక్కలు నాటారు. సంస్థ ఉద్యోగులందరికీ కుటుంబ సభ్యులతో కలిపి యాజమాన్యం భోజనాలు ఏర్పాటు చేసింది. కార్యక్రమాలలో కెసిపి జనరల్ మేనేజర్ రమణారావు, అధికారులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహా మనిషి మోక్షగుండం విశ్వేశ్వరయ్య

సెప్టెంబరు 15 భారతీయ ఇంజినీర్లందరికీ ఓ పండగరోజు. ప్రఖ్యాత ఇంజినీరు, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఆ రోజునే. ఈయన స్మారకార్థం ప్రతి సంవత్సరం ఆ రోజును ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నారు. మౌలిక వసతుల కల్పనకు ఇంజనీరింగ్ రంగం ఎంత ప్రధానమైనదో జీవితాంతం కార్యశీలురుగా నిరూపించిన మహా మనిషి ఆయన. నైతిక విలువల ఆధారంగా పనిచేసి ఇంజినీరింగ్ రంగానికి విశిష్ట మైన గుర్తింపు, గౌరవం సంపాదించి పెట్టారు. అందుకే ఆ మహనీయుని జన్మదినాన్ని 'ఇంజనీర్స్ డే'గా ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఇంజినీర్స్ డే సందర్భంగా ఈ జాతికి ఆయన చేసిన చిరస్మరణీయ సేవలను మననం చేసుకోవడం ఈతరం ఇంజినీర్లకు, ఇంజనీరింగ్ వృత్తిలో ప్రవేశిస్తున్న లక్షలాది యువతీ యువకులకు ఎంతో స్ఫూర్తిదాయకం...

అతి సామాన్య కుటుంబంలో జన్మించి, అనేక ఒడిదుడుకులలో విద్యనార్జించి, ఉన్నతోన్నత పదవులను అలంకరించి, అద్వితీయ మేధా సంపత్తితో, అకుంటిత దేశభక్తితో, అశేష ప్రజానీకానికి ప్రయోజన కరంగా, వివిధ రంగాలలో భారతదేశ సిరిసంపదలను కీర్తిప్రతిష్టలను పెంపొందించిన మహనీయులల మోక్షగుండం విశ్వేశ్వరయ్య అగ్రగణ్యులు. నూరేండ్లపైబడి జీవించి, సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు నిర్విరామకృషి సల్పి, ఆంగ్లేయ పరిపాలనకు గానీ, సంస్థానాధీశులకుగానీ తలవంచనిరీతిలో, తన ప్రత్యేకతలను స్వతంత్ర ప్రతిపత్తిని, ఆత్మాభిమానాన్ని, జాతి గౌరవాన్ని, పరిపోషిస్తూ భారతరత్న బిరుదానికే వన్నెతెచ్చిన, ఆ యశస్వి ఆదర్శ జీవనం ఎంతో స్ఫూర్తిదాయకం.

ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలోని మోక్షగుండం అనే గ్రామంలో విశ్వేశ్వరయ్య పూర్వీకులు నివసిస్తూండేవారు. అందువల్ల మోక్షగుండం ఆయన ఇంటి పేరైయింది. కానీ విశ్వేశ్వరయ్య తాతముత్తాతలు మైసూరు రాష్ట్రపు కోలార్ జిల్లాలో నందికొండ సమీపంలోని ముద్ద సహళ్లిలో స్థిరపడ్డారు. అది ఆయన స్వగ్రామమైంది. ఆయన 15 సెప్టెంబరు 1861లో జన్మించారు. కోలార్ జిల్లాలోని చిక్కబళ్లాపూర్‌లో ఒక ప్రాథమికోన్నత పాఠశాలలో చేరి హైస్కూలు స్థాయి వరకు విద్యనభ్యసించారు. విశ్వేశ్వరయ్య బి.ఎ పరీక్షలలో అత్యుత్తమస్థాయిలో ఉత్తీర్ణుడయ్యారు. పూనాలోని సైన్స్ కాలేజీలో ఇంజినీరింగ్ చదివారు. 1883లో తన 23వ ఏట ఎల్‌సియి, ఎఫ్‌సియిఎల్ పరీక్షల్లో బొంబాయి రాష్ట్రంలో ప్రప్రథముడుగా ఉత్తీర్ణుడయ్యారు.

1884 మార్చిలో బొంబాయి ప్రజాపనుల శాఖలో అసిస్టెంట్ ఇంజినీరుగా విశ్వేశ్వరయ్య నియమితులయ్యారు. అనేక ఘన విజయాలతో దేశసేవకు అంకితమైనదిగా ఆయన ఉద్యోగజీవితం ప్రారంభమైంది. నూట రెండేళ్ల ఆరు మాసాల ఎనిమిది రోజులు జీవించిన అనంతరం 1962 ఏప్రిల్ 14వ తేదీ శనివారం ఉదయం 6.15 గంటలకు కన్నుమూశారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘకాలం ఆయన దేశానికి చేసిన సేవ అనన్య సామాన్యం. ఆయన తన జీవితంలో ఒక్క క్షణం కూడా వృథా కానీయలేదు. ఆయన అనేక బాధ్యతలు నిర్వహించారు. అందులో ముఖ్యమైనవి ఆటోమేటిక్ స్లూయిస్‌గేట్ నిర్మాణం. ఏడెన్ నగరానికి నీటి సరఫరా, మైసూరు సంస్థానంలో ప్రధాన ఇంజినీర్‌గా, కృష్ణరాజసాగర్ నిర్మాణం, భద్రావతి ఉక్కు కర్మాగారం నిర్మాణం, దేశ ఆర్థికాభివృద్ధికి కృషి, సాంఘిక చైతన్యం, గంగానది వారధి నిర్మాణం, తుంగభద్రా ప్రాజెక్టు నిర్మాణం మొదలైనవి. కీర్తి ప్రతిష్టల కోసం ఆయన ఆశించకపోయినా అనేక ప్రాంతాల నుండి గౌరవ పురస్కారాలు ఆయనకు లభించాయి. 1911లో కంపానియన్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ అనే బిరుదు, 1915లో నైట్ కమాండర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ అనే బిరుదు, ఎనిమిది భారతీయ విశ్వవిద్యాలయాల గౌరవ పదవులు, పథకాలు మొదలైన అసంఖ్యాక పురస్కారాలు ఆయనకు లభించాయి. 1955లో భారత రాష్ట్రపతి ఈ దేశంలోని ఉత్తమోత్తమమైన 'భారతరత్న' బిరుదుతో సత్క రించారు. విశాఖపట్నం హార్బరు లోపలికి ఓడలు ప్రవేశించే సముద్రపు కయ్యలో ఇసుక పేరుకొని మార్గానికి ఎదురుగా సముద్రంలో ఒక అడ్డుకట్ట కట్టాలి. సముద్ర మధ్యలో అడ్డుకట్ట నిర్మాణం కష్టసాధ్యమని ఇంజినీర్లు భావించారు. ఆ పరిస్థితిని స్వయంగా పరిశీలించిన విశ్వేశ్వరయ్య అడ్డుకట్ట కట్టాల్సిన చోట రెండు పెద్ద ఓడలను సిమెంటు దిమ్మెలతో ముంచితే ఆ సమస్యకు పరిష్కారం కాగలదని సూచించారు.

శ్రీ విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజినీరైనా ఆయన అన్ని రంగాల్లోని భారతీయ ఇంజినీర్లకు ఆదర్శప్రాయుడయ్యారు. ఆయన దూరదృష్టి, దేశభక్తి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆయన కృషి, పరిశ్రమలు, వ్యవసాయం, విద్య గ్రామీణ ప్రాంత అభివృద్ధి మొదలగు అనేక రంగాల్లో ఈ జాతికి ఆ మహనీయుడు అందించిన సేవలకు భారతజాతి రుణపడి ఉంటుంది. 1960 సెప్టెంబరు 15వ తేదీన యావద్భారత దేశంలోపాటు విదేశాలలో కూడా విశ్వేశ్వరయ్య శతవార్షిక జయంతి ఉత్సవాలు జరిగాయి. భారత ప్రభుత్వం, సర్ ఎం.విశ్వేశ్వరయ్య ఛాయాచిత్రం గల ఒక తపాల బిళ్లను విడుదల చేయడమేకాక, ఆయన సాధించిన ప్రగతి అనేక ప్రముఖ వార్తా పత్రికలు ప్రత్యేక సంచికలు ప్రచురించాయి. అనేక చోట్ల ఆయన విగ్రహాలు ప్రతిష్టించబడ్డాయి. విశ్వేశ్వరయ్యను వేరే ఎవరితోనూ సరిపోల్చలేం. ఆయనకు ఆయనే సాటి. విశ్వవిఖ్యాత ఇంజనీర్‌గా, పాలనాదక్షు డుగా, రాజనీతిజ్ఞుడుగా, నిష్కామ దేశభక్తుడిగా అఖండ కీర్తిని ఆర్జించిన మహనీయుడు ఆయన. మోక్షగుండం విశ్వేశ్వరయ్య గురించి తెలుసుకోవడం అంటే భారతదేశ ఇంజినీరింగ్ రంగ ప్రగతిని తెలుసు కోవడమే...!

నిజాయితీకి నిలువెత్తు రూపం

విశ్వేశ్వరయ్య ఒకసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. కొంత డబ్బు కావాల్సి వచ్చింది. మైసూరు బ్యాంక్ మేనేజర్ బి.వి.నారాయణ రెడ్డికి ముందుగా ఫోన్ చేసి, బ్యాంకుకు వెళ్లారు. మేనేజర్ ఆయననెంతో గౌరవంగా లోపలికి తీసుకెళ్లారు. అన్ని దరఖాస్తులు సిద్ధమయ్యాయి. విశ్వేశ్వరయ్య తమ వద్ద ఉన్న భారత ప్రభుత్వ రుణ పత్రాలను ఇచ్చి తాకట్టు పెట్టుకోమన్నారు. మేనేజర్ ఆశ్చర్యంతో 'తాము తాకట్టు పెట్టడమా! ఇది మీరు నెలకొల్పిన బ్యాంక్' అంటూ తిప్పి ఇవ్వగా విశ్వేశ్వరయ్య తీసుకోలేదు. బ్యాంకు వారు తక్కువ వడ్డీ సూచించగా– అందరికీ విధించే వడ్డీ వేయమన్నారు. బ్యాంకు మేనేజర్ వడ్డీ తగ్గించబోయారు. దీంతో ఆయన మండిపడి 'ఏం నేను అందరి మనుష ల్లాంటి వాడిని కానా? నాకు ఎందుకు ఈ తగ్గింపు? ఇలా అయితే నాకు మీ అప్పే అవసరం లేదు. మరొకరి దగ్గరకు వెళతాను' అన్నారు. తన ఉద్యోగ జీవితంలో ఎక్కువ వడ్డీ వేయమని కోరినవారు విశ్వేశ్వర య్య ఒక్కరే అంటూ బ్యాంక్ మేనేజర్ ప్రశంసించారు.

ఎంతో క్రమశిక్షణ

విశ్వేశ్వరయ్య వ్యక్తిగత జీవితం అతి క్రమశిక్షణతో ఉండేది. కాల నియమాన్ని, ఆహార విహార నియమాలను కచ్చితంగా పాటించిన విశ్వేశ్వరయ్య 100 సంవత్సరాల వయస్సులో కూడా కళ్లద్దాలు లేకుండా చదివేవారు. **'గంధపు చెక్క వలె సేవలో అరిగిపో, కాని ఇనుములా తుప్పు పట్టవద్దు' అనేది ఆయన జీవన ధ్యేయం.** దేశ విదేశాలలోని విశ్వవిద్యాలయాలు వారిని సత్కరించాయి. 1961లో విశ్వేశ్వరయ్య శత జయంతి ఉత్సవాలకు భారత ప్రధాని నెహ్రూ విచ్చేశారు. 'మేము మాటలతో కాలయాపన చేశాం. వారు నిరంతర క్రియా శీలురై నవభారత నిర్మాణానికి కృషి చేసిన మహనీయులు' అంటూ నివాళులర్పించారు నెహ్రూ.

భారతరత్న బిరుదు

భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యని 'భారతరత్న' బిరుదుతో సత్కరించింది. విశ్వేశ్వరయ్య 'ప్లాన్‌డ్ ఎకానమి ఫర్ ఇండియా', 'రికన్‌స్ట్రక్టింగ్ ఇండియా', అన్ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ ఇండియా; ఇట్స్ కాజెస్, క్యూర్', 'మెమరీస్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్' (ఆత్మకథ) రచించారు. జీవితాంతం దేశ ప్రగతికి, ప్రజాశ్రేయస్సుకు కృషిచేసిన విశ్వేశ్వరయ్య 1962 ఏప్రిల్14న కన్నుమూశారు.

WITH BEST COMPLIEMENTS FROM....
HAPPY ENGINEERS DAY
శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య
N.SANKARAIAH, b.arch
nannapaneni associates
architects & interior designers
Ground Floor, Kamalesh Grand, 4th Lane,
Lakshmi Puram, Guntur. Ph : 2350671,
Mob : 94402 60002. Email : SANKARAIAH_9@REDIFFMAIL.COM

ఇంజనీర్స్ డే శుభాకాంక్షలతో...
HAPPY ENGINEERS DAY
SIVA SAI ARCHITECTS
బిల్డింగ్ ప్లాన్స్, లే అవుట్స్, CRDA & మున్సిపల్ అప్రూవల్స్, కన్‌స్ట్రక్షన్స్, ఎలివేషన్స్ చేయబడును.
బిల్డింగ్ కాంట్రాక్ట్ పద్ధతిలో చేయబడును.
తోట శ్రీనివాసరావు, ఇంజనీర్
Annapurna Nagar 4th Line, West Side,
Near Metal Furniture Shop, Guntur. Ph : 9989592561

Happy Engineers Day
భావి తరాలకు ఎంతో స్ఫూర్తినందించి ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్
శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి జయంతి సందర్భంగా
ఇంజనీర్లందరికీ ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు...
HAPPY ENGINEERS DAY
LAKSHMAN.M
MYNENI ASSOCIATES
DOOR NO 6-15-55, (31-15-1286), GROUND FLOOR
15/2 ARUNDELPET GUNTUR.
ANDHRA PRADESH - 522002. CELL NO 98855 69096

HAPPY ENGINEERS DAY
భావి తరాలకు ఎంతో స్ఫూర్తినందించిన
ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్
శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి
జయంతి సందర్భంగా
ఇంజనీర్లందరికీ ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు...
హౌసింగ్ కార్యాలయ సిబ్బంది
తాడికొండ, గుంటూరుజిల్లా.

ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
భావి తరాలకు ఎంతో స్ఫూర్తినందించి
మనందరికీ ఎన్నో ప్రాజెక్టులనందించిన
శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి
జయంతి సందర్భంగా
ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు...
వై.సుధాకరరావు, DEE
PIU, సబ్ డివిజన్ సత్తెనపల్లి
ఎం. సాయిరామ్ కిరణ్, A.E
PIU సబ్ డివిజన్, సత్తెనపల్లి
బి.వి.శేషాచలపతి A.E
PIU సబ్ డివిజన్, సత్తెనపల్లి
టి.నీలవేణి, J.A.
PIU సబ్ డివిజన్, సత్తెనపల్లి
ఆర్.బుజ్జిబాబు, O.S.
PIU సబ్ డివిజన్, సత్తెనపల్లి
P.I.U. డిపార్ట్‌మెంట్
సత్తెనపల్లి ప్రాజెక్ట్ సబ్ డివిజన్, పల్నాడు జిల్లా

గాడిచర్ల హరి సర్వోత్తమరావుకు నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక, గ్రంథాలయ అభి వద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమ పితామహులు గాడిచర్ల హరి సర్వోత్తమరావు 140వ జయంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి జెవివి రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ప్రముఖ సాహితీ విమర్శకు లు డా. పివి సుబ్బారావు మాట్లాడుతూ కాలేజీ చదివే రోజుల్లోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపిన తొలి తెలుగు రాజకీయ ఖైదీ గాడిచర్ల అని, దత్త మండ లాలకు రాయలసీమ అని పేరుపెట్టింది గాడిచర్ల అని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగుల్ మీరావలి, ఎమ్.రాధాకష్ణ, ఉప్పాల భాస్కరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, చుక్కా విన్సెంట్ పాల్, సరోజిని పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - అమరావతి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో జరిగిన వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, అమరావతి మండల ఎంపీపీ మేకల హనుమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గురు కులంలో ఉన్న 800 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు,కళ్లద్దాలు అందించామని ఎంపీపీ హను మంతరావు తెలిపారు. అనం తరం గ్రామపంచాయతి కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో హనుమంతరావు పాల్గొన్నారు జగనన్న సురక్ష గురించి జరిగిన సమావేశంలో ఏఎన్ఎం ఎం ఎల్ హెచ్ పి లతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' పై అవగాహన

క్రోసూరు-ప్రజాశక్తి

క్రోసూరు పిహెచ్‌సి పరిధిలోని ఎఎన్ఎం, ఎంఎలాచి, ఆశ, సూపర్‌వైజర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సును స్థానిక ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. డాక్టర్ బాల అంకమ్మ బాయి , డాక్టర్ సిరి చందన ఆధ్వర్యంలో వారికి అవగాహన కల్పిం చారు. ఈ నెల 15 నుండి ఎంఎల్‌ఎ హెచ్పీ , ఏఎన్ఎం లు ఇంటింటి సర్వే నిర్వహించి దీర్ఘకాలిక రోగాలు, బాలింతలు, గర్భిణులు,స్కూల్ పిల్లలకు పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్య సహాయం అవసరమైన వారికి కేటాయించిన తేదీలలో వేదిక వద్దకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 3వ తేది నుండి 27 వరకు జరుగుతుందని, ప్రజలందరూ కూడా స్పెషలిస్టు వైద్యుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల మార్పులు,చేర్పులపై సమావేశం

ప్రజాశక్తి - నకరికల్లు

పోలింగ్ కేంద్రాలు మార్పులు, చేర్పులపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతి నిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. తహ శీల్దార్ కె.నగేష్ మాట్లాడుతూ మండలంలోని రూపిన గుంట్లలో 212, 214 పోలింగ్ కేంద్రాలు, చాగల్లులోని 200వ పోలింగ్ కేంద్రాల భవనాలు శిధిలావస్థకు చేరు కోవడంతో వాటిని కూల్చివేసి కొత్తగా నిర్మాణం పూర్తయిన భవనాల్లో కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామన్నారు.

రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశంలో తహశీల్దార్ కె.నగేష్

కారంపూడిలో నూతన పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి -కారంపూడి

పట్టణంలోని రెండు సచివాలయాల పరిధిలో, ఒక్కో సచివాలయ పరిధిలో 60 చొప్పున మొత్తం 120 నూతన పెన్షన్ల మంజూరైయినట్లు పల్నాడు జిల్లా వైయస్సార్సీపి కార్యదర్శి కొమ్ము. చంద్రశేఖర్ తెలిపారు. మంజూరైన నూతన పెన్షన్ల పంపిణీ కార్య క్రమాన్ని ఆదినారాయణ కాలనీలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొమ్ము. చంద్రశేఖర్ పాల్గొని లబ్ధిదారులకు నూతన పెన్షన్లు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభు త్వం ఏర్పడిన తర్వాత సామాజిక పెన్షన్ను అంతకు ముందు కంటే పెంచి వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, చర్మకారులు, డప్పు కళాకారులు, ఇంకా వగైరా పెన్షన్లను ఏ విధమైన తారతమ్య భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కిల్లా. కాశి, ఎస్టీ సెల్ నాయకులు పొన్నలూరి. సుభాని, వాలంటీర్లు దుర్గారావు, నంబూరి. దుర్గాదేవి ఇంకా తదితరులు పాల్గొన్నారు.

16న మండల స్థాయి ఎస్.జి.ఎఫ్ సెలక్షన్స్

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్. జి. ఎఫ్) సెలక్షన్స్ జరుగుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ, వ్యాయామ ఉపా

ధ్యాయులు వై.సైదయ్య గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సెలక్షన్స్ లో పాల్గొనే క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నీకాయిట్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ వంటి 9 రకాల క్రీడలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మండలంలో అన్ని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల విద్యా ర్థులకు మండల స్థాయి ఎస్.జి.ఎఫ్ సెలక్షన్స్ జరుగు తాయని అన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాలని అన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న అమల కుమారి, శాస్త్రవేత్త రమేష్

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని నర్సింగపాడు గ్రామంలోని వరి పొలాలను పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డి డి ఏ అమల కుమారి, జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జి. రమేష్ గురువారం పరిశీలించారు. గ్రామంలో 50 శాతం విస్తీర్ణంలో ఎపి 567 పంట వేశారన్నారు. చిరు పొట్ట దశలో ఉన్నందున ఆఖరి సారిగా వేసే యూరియా 25 కిలోలు, 20 కిలోల పొటాష్ కలిపి వేయాలన్నారు. ఆకు ముడత పురుగు నష్ట పరిమితి స్థాయి కంటే తక్కువగా ఉన్నందున ఎలాంటి పురుగు మందులు పిచికారి చేయవద్దని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు మండలంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని తహశీల్దార్ జి.అంకారావు, ఎండిఓ కె. మ్యాథ్యూబాబు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కాగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న ఈ కార్యక్రమమునకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం తహశీల్దార్ జి.అంకారావు,ఎండిఓ కె. మ్యాథ్యూబాబు, మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి పరిశీలించారు.

'ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష'

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో గురువారం సాయంత్రం 'హిందీ దివస్'ను ఘనంగా నిర్వ హించారు. జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష దోహద పడిందని, జాతీ య భాషగా ఎంతో ప్రాముఖ్యత ఉందని హిందీ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, టి.మాధవిలు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో శంకరభారతిపురం హైస్కూల్లో జరిగిన హిందీ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, జిల్లాలో ద్వితీయ స్థానాన్ని పొంది, నర్సరావుపేటలోని టౌన్ హాల్ లో ఉన్నతాధికారులు, బహుమతులను పొందిన విద్యార్థులను, డిబేట్, డ్రాయింగ్‌లో బహుమతులు పొందిన విద్యార్థులను అభి నందించారు. పాఠశాల స్థాయిలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యోగ ఉపాధ్యాయుడు నాగబాబుని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, పిసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-రొంపిచర్ల: మండలంలో కొనకంచివారిపాలెంలో గురువారం పౌష్టి కాహార మాసోత్సవాలు జరిగాయి. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రదర్శించిన రాగు లు, సజ్జలు, జొన్నలు, బఠాణీలు, అలసందులు, శనగల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. గర్భిణీ స్త్రీలు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు.

పాల రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని లగడపాడు లో సంఘం డెయిరీ మిల్క్ కలెక్షన్ సెంటర్ ల పాల రైతులకు గురువారం బోనస్ పంపిణీ చేశారు. 40 మంది రైతులకు గాను రూ. 1,10,000 అందజేశారు. అం దిం చారు. కార్యక్రమంలో మిల్క్ కలె క్షన్స్ సెంటర్ అధ్యక్షులు బి.కోటేశ్వరరావు, సంగం డైరీ మేనేజర్ గోవి, సూపర్వైజర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బెల్లంకొండ

సంగం డెయిరీ నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ గ్రామాల్లో సంఘం డెయిరీ వారు సభ్యులకు బోనస్ పంపిణీ చేశారు. బెల్లంకొండలో సభ్యులు 79 మందికి సంవత్సరానికి గాను రూ. 14 లక్షల 65 వేల రెండు వందల దీనికి సభ్యులకి వందకి ఐదు రూపాయలు చొప్పున బోన స్‌ను అందజేశారు. నాగిరెడ్డిపాలెంలో సభ్య లకు రూ. 48 లక్షల 65 వేల 900 ఇచ్చారు. కార్యక్రమంలో రొంటపాళ్ల బిసి పాయింట్ మేనే జర్ గోపి, గంగిరెడ్డిపాలెం బీసీ పాయింట్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్స్ 1) గుంటూరు జిల్లా కాకుమాను మండలం కాకుమాను వాస్తవ్యులు అయిన శ్రీమతి నందిపాటి పద్మావతి భర్త హరిబాబు 2) పల్నాడు జిల్లా అమరావతి మండలం మండేపూడి గ్రామ వాస్తవ్యులు అయిన శ్రీమతి వెనుముచ్చు అంజలీ దేవి భర్త సుబ్బారావు 3) గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామ వాస్తవ్యులు అయిన శ్రీమతి పిన్నమనేని అన్నపూర్ణ భర్త శ్రీనివాసరావు గార్ల ద్వారా సమాచారం పొంది ఇచ్చిన ప్రకటన. తాడికొండ మండలం రావెల గ్రామములో సర్వే నెంబర్ 20-1 నందు య. 0.81 సెంట్లు, సర్వే నెంబర్ 20-3 నందు య. 1-87 సెంట్లు, సర్వే నెంబర్ 64-2 నందు య.0.13 సెంట్లు, సర్వే నెంబర్ 175-1 నందు య. 4.38 సెంట్లు, సర్వే నెంబర్ 176-1 నందు య. 0.13 సెంట్లు, సర్వే నెంబర్ 177-1 నందు య. 0.84 సెంట్ల వ్యవసాయ భూమి వారసత్వంగా సంక్రమించింది అని సదరు విస్తీర్ణములను వెబ్ ల్యాండ్ అడంగల్ నందు నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకములను మంజూరు చేయవలసినదిగా కోరుచూ తాడికొండ తహశీల్దారు వారి కార్యాలయం నందు అర్జీ దాఖలు పరిచి యున్నారు.

సదరు అర్జీ ననుసరించి విచారణ దాఖలా అర్జీదారులకు పై తెలిపిన విస్తీర్ణములు వీరిలో 1,2 వారలకు సోదరుడున్నూ. 3వ వారికి బాబాయి గారు అయిన శ్రీ మూల్పూరి నాగ హనుమంతరావు తండ్రి రమణయ్యగారి మరణానంతం వారసత్వముగా సంక్రమించిందని మరియు శ్రీ మూల్పూరి నాగ హనుమంతరావు గారి నుంచి అర్జీ దారులకు అన్ రిజిస్టర్ వీలునామా ది. 17/04/2021 ద్వారా రావెల గ్రామములో పై తెలిపిన సర్వే నెంబర్ ల లోని భూములు సంక్రమించియున్నవని సదరు విస్తీర్ణములను అడంగల్ నందు నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయవలసినదిగా కోరిన మీదట పై తెలిపిన రావెల గ్రామ సర్వే నెంబర్లలోని విస్తీర్ణములను పై వార్ల పేరున సవరణలు చేయుట లో ఎవరికైనా అభ్యంతరములు లేదా ఆక్షేపణలు వున్నచో ఈ ప్రకటన ప్రచురించిన 7 దినములలో శ్రీయుత నాకు గాని లేక సంబంధిత తహశీల్దార్ వారి కార్యాలయం తాడికొండ నందు వారి యొక్క అభ్యంతరములు లేదా ఆక్షేపణలు తెలియపరచవలసినదిగా కోరడమైనది.

వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి,
న్యాయవాది, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్,
సెల్ : 9866448668

చిలకలూరిపేట పురపాలక సంఘం

Roc.No. 370/Works/2022/E1 Date : 14-09-2023

E-Procurement Notice

I. 1. Number of Works : 4 2. Estimate Contract Value : 22,83,844/-
3. Name of Work :- Construction of 30 feet and 20 feet arches at YSR Jagananna Colonies in Chilakaluripet Municipality
4. Bid Document Download Start Date : 15-09-2023 11.00 AM
5. Bid Document Download End Date : 22-09-2023 4.00 PM
6. Bid Submission Closing Date 22-09-2023 4.30 PM
7. Name and address of the office : Commissioner
Chilakaluripet Municipality,
Phone : 08647 - 253994, 9849906585
for other detaisl Visit : https://tender.apeprocurement.gov.in

స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ చిలకలూరిపేట

Sd/- Commissioner,
Chilakaluripet Municipality.

నగరంలో వీధి కుక్కల స్వైర విహారం

- గత ఆగస్టులో 3042 మందికి కుక్కకాటు
- చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం
- వీధి కుక్కల నిర్మూలనకు చేస్తున్న ఖర్చులు గోప్యత!

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

నగరంలో వీధి కుక్కలు రెచ్చి పోతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట చిన్నారులపై పెద్దలపై వీధి కుక్కలు స్వైర విహా రం చేస్తున్నాయి. నగరపరిధిలో ఒక్క గురువారం రోజే కుక్కకాట్లకు గురై 10 మంది విరోసెల్ కల్చర్ వ్యాక్సిన్ తీసుకునేందుకు గుంటూరు జి.జి.హెచ్ కు రాగా తదుపరి యాంటీ రేబిస్ ఇంజక్షన్ కోసం 129 మంది బాధితులు వచ్చారు. ఆగస్టు నెలలో 3042 మంది కుక్కకాటులకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. లెక్కల్లోకి కాకుండా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నవారు మరీ కొంతమంది ఉన్నారు. రాత్రిళ్ల ఒంటరిగా, వాహనాలపై వెళ్లే వారిపై కుక్కలు గుంపుగా విరుచుకుపడుతున్నాయి. వీధుల్లోకి వెళ్లాలంటే భయపడుతూ వెళ్లాల్సి వస్తోందని, నగరకాలనీ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తవారి మాట అలా ఉంచితే, కాలనీ వారిని కుక్కలు కరుస్తున్నాయి. దీనికితోడు కొందరు యజమానులు రాత్రివేళల్లో తమ పెంపుడు కుక్కలను వీధుల్లోకి వదిలేస్తుండటంతో అవి కూడా ప్రతి ఒక్కరిపై దాడికి దిగుతున్నాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అమరావతి రోడ్, గోరంట్ల ,ఆటోనగర్, కొండయ్య కాలనీ, బస్టాండ్, పాత గుంటూరు, నల్లచెరువు చుట్టుగుంట ఇలా నగర పరిధిలో వీధి కుక్కల దాడుల్లో పలువురు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటనలు వెలుగు చూస్తు న్న అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుండి వెల్లువెత్తాయి. రాత్రి వేళల్లో శునకాలు ద్విచక్ర వాహనదారుల వెంట పడుతుండటతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధిక సంఖ్యలో వాహనచోదుకులు గాయాలపాలవు తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వీధికుక్కల నియంత్రణకు సిబ్బంది చేపడుతున్న పనులపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కుక్కలను వేరే ప్రాంతాలకు తరలించి నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నియంత్రణకు అన్ని చర్యలు చేపడుతున్నాం

ప్రజా ఆరోగ్య విభాగం అధికారి భాను ప్రకాష్

నగరంలో వీధికుక్కల నివారణకు నగరపాలక సంస్థ తరపున యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏ.బి.సి) చర్యలు పటిష్టం గానే చేపడుతున్నామని నగర పాలక సంస్థ ప్రజా ఆరోగ్య విభాగం అధికారి భాను ప్రకాష్ 'ప్రజాశక్తి'కి వివ రణ ఇచ్చారు. కుక్కలకు రాబిస్ రాకుండా నగరం అంతా తిరు గుతూ ఇంజక్షన్లు వేయిస్తున్నట్లు చెప్పారు. అయితే, ప్రతి సంవత్సరం వీధి కుక్కల నియంత్రణ కోసం ఎంత ఖర్చు పెడుతున్నారనే వివరాలు వెల్లడించేందుకు ఆయన నిరాసక్తత చూపించడం కొసమెరుపు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- పేరేచర్ల లేఅవుట్‌ను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-మేడికొండూరు

పేదలందరికీ ఇళ్ళ పథకం లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించినందున లబ్ధిదారులు వేగవంతంగా ఇళ్ళు నిర్మించుకునేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. గురువారం పేరేచర్లలో కైలసగిరి సమీపం లోని ఇళ్ళ పథకం లేఅవుట్ 3లో ఇళ్ళ నిర్మాణాలను కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. లే అవుట్‌లో 188 ప్లాట్లలో ఇళ్ళ నిర్మాణాలు మంజూరు చేయగా ఇప్పటికే 84 ఇళ్ళు నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగతా 104 ఇళ్ళు తుది పనులు, స్లాబ్‌లు, లెంటల్ లెవల్ లో ఉన్నాయని హౌసింగ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. లే అవుట్లలో నిర్మాణంలో ఉన్న స్వాగత ద్వారంను, అంతర్గత రహదారులను, నిర్మాణాలు పూర్తి అయిన ఇళ్ళ వద్ద విద్యుత్, మంచినీటి పంపులు, సోప్‌పిట్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ళలో నివాసం ఉంటున్న లబ్దిదారులను మౌలిక సౌకర్యాల కల్పనపై కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. మంచినీరు, విద్యుత్ సౌకర్యం, అంతర్గత రహదారులు, సోప్‌పిట్‌లు ఏర్పాటుపై నివాసితులు సంతప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్‌కు అప్రోచ్ రహదారితోపాటు అంతర్గత రహదారుల ఏర్పాటుతోపాటు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం పూర్తి స్థాయిలో కల్పించి నందున సెప్టెంబరు 30 నాటికి ఇళ్ళ నిర్మాణాల పెండింగ్ పనులు పూర్తి చేసేలా స్టేజ్ అప్డేషన్ వేగవంతం చేయాలన్నారు. నిర్మాణం పూర్తి అయిన ప్రతి ఇంటికి పీఎం అవాస్ యోజన, నవరత్నాలు పేదలందరికీ ఇళు లోగో బోర్డులు ఏర్పాటు చేయించాలన్నారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కు సంబంధించిన నిధులు పెండింగ్ లేకుండా పూర్తి స్థాయిలో లబ్దిదారులకు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ఏపీఎంలకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, లే అవుట్ ప్రత్యేక అధికారి సహకార శాఖ జిల్లా అధికారి వీరాచారి, హౌసింగ్ ఈఈ శంకర్రావు, మేడికొండూరు తహశీల్దారు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

సాంబశివరావు మృతికి రైతు సంఘం నివాళి

ప్రజాశక్తి-తెనాలి :సౌత్ ఇండియా లెమన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి పాలేటి సాంబశివరావు మృతికి ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబి రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక నందులపేటలోని నివాసంలో సాంబశివరావు మృత దేహా న్ని గురువారం ఆయన సందర్శించారు. కుటుంబ సభ్యు లకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 1952లో సిపిఎం అగ్ర నాయకులు ఇఎన్ఎస్ నంబూద్రి ప్రసాద్ పట్టణంలో బహిరంగ సభ నిర్వహించినపుడు గ్రామాల్లో సైకిల్‌పై పర్యటించి ప్రచారం నిర్వహించారన్నారు. పార్టీ అగ్ర నాయకులు మోటూరి హనుమంతరావు, లావు బాలగంగాధర రావు, పర్చూరు నాగేశ్వరరావుతో ఆయనకు సన్నిహిత సంబం ధాలు ఉన్నాయని గుర్తుచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాలకు సాంబశివరావు తోడ్పాటును అందించేవారన్నారు. నివాళులర్పించిన వారిలో యార్డు చైర్మన్ అవుతు సీతా నగేష్ రెడ్డి, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిజెవి సుబ్బారావు ఉన్నారు.

ఎస్సై అభ్యర్థులకు దేహధారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ: పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా గుంటూరు రేంజ్ పరిధి కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో 15 రోజు దేహదారుఢ్య పరీక్షలు గుంటూరు రేంజ్ ఐ.జి పాల్ రాజు మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ సుబ్బారెడ్డి అడిషనల్ ఎస్పీ సుప్రజా పర్యవేక్షణలో కొనసాగాయి. 705 మంది అభ్యర్థులకు గాను 382 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు ఐ.జి తెలిపారు.వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టుల అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ లతో పాటు 1600,100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు.

కాలుష్య ఉద్గారాలను నియంత్రిస్తేనే మనుగడ

పర్యావరణ పరిరక్షణపై అంతర్జాతీయ సెమినార్ ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - ఏఎన్‌యు: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్య కారకాలు, ఉద్గారాలను పెంచుతున్నాయని, వాటిని నియంత్రిచకపోతే మానవ మనుగడకు రాబోయే కాలంలో పెను ప్రమాదాలు తప్పవని పలువురు దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు అభిప్రాయపడ్డారు. కేంద్రప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎన్ఐ-ఎంఎస్ఎంఇ) శిక్షణా సంస్థ (నేషనల్ ఇని స్టిట్యూట్ ఆఫ్ మైక్రో అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ని-ఎంఎస్ఎంఇ), ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పర్యావరణ విద్య విజ్ఞానశాఖ విభాగం ఆధ్వ ర్యంలో యూనివర్శిటీలోని సెమినార్ హాలులో 'పర్యావరణ మార్పులు సాంకేతిక నిర్వహణ'అనే అంశంపైన వాతా వరణంలో మార్పులపై అంతర్జాతీయ సదస్సు గురు వారం జరిగింది. ముఖ్యఅతిథి వక్ఫ్‌బోర్డు సిఇఒ, సెక్రటరీ ఎం.వి.శేషగిరిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించటంతోపాటు నూతన సాంకేతిక విజ్ఞానమైన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్‌లాంగ్వేజ్ వంటి వాటిని ఉప యోగించుకుని ప్రజల్లో అవగాహన కల్పించాల్సి వుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఉపకులతి ఆచార్య రాజశేఖర్ పట్టేటి మాట్లా డుతూ శాస్త్ర, సాంకేతి కను ఉపయోగించి వాతావరణంలో కాలుష్య కారకాల నిరోధానికి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. డైరెక్టర్ జనరల్ ఎంఎస్ఎంఇ డాక్టర్ ఎస్ గ్లోరీ స్వరూప, కియోటాటెల్ సమోయి యూని వర్శిటీ జియాలజీ, ఎన్వీరాన్‌మెంటల్ సైన్స్ డాక్టర్ జార్జి మరోరో ఓన్‌టుంబి (కెన్యా), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాట్మండు యూనివర్శిటీ (నేపాల్) డాక్టర్ నాని రౌత్, పర్యావరణ పరిం క్షణ నిపుణులు, పరిశ్రమల సర్వీసు బ్యూరో దనుష్క బంద్ర (శ్రీలంక) మాట్లా డారు. ఎఎన్‌యు రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ప్రొపెసర్ బి.కరుణ, కాన్ఫరెన్స్ డైరెక్టర్ (ని-ఎంఎస్ఎంఇ) కె.సూర్యప్రకాష్‌గౌడ్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ జె.కోటేశ్వరరావు (ని-ఎంఎస్ఎంఇ, ఎఎన్‌యు పర్యావరణ విజ్ఞాన శాస్త్రం విభాగాధిపతి ప్రొపెసర్ పి.బ్రహ్మాజీరావు ప్రసంగించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై పత్ర సమర్పణ జరిగింది.

16న పల్సర్ మేనియా

ప్రజాశక్తి-గుంటూరు సిటీ: ఈనెల 16న అమరావతి రోడ్‌లోని బండ్లమూడి గార్డెన్స్‌లో మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పల్సర్ మేనియా విన్యాసాల కార్యక్రమం జరుగు తుందని శ్రీ సిద్ధి వినాయక బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. ఈ విన్యాసాల్లో పాల్గొనేవారు శ్రీ సిద్ధి వినాయక షోరూమ్ కు వచ్చి పేర్లు రిజిస్టర్ చేసు కోవాలని కోరారు. పల్సర్ మానియా ప్రచారం కోసం నేడు అమరావతిరోడ్‌లోని, సినీ స్క్వేర్ థియేటర్ ఎదురుగా శ్రీ సిద్ధివినాయక బజాజ్ షోరూమ్ ప్రారంభం కానుంది.

15, 16 తేదీల్లో శేకూరు రైల్వే గేట్ మూసివేసివేత

ప్రజాశక్తి - చేబ్రోలు

సంఘం జాగర్లమూడి, శేకూరు రైల్వే గేట్ వద్ద అత్యవసర ట్రాక్ మరమ్మతుల నిమిత్తం గేటును పాక్షికంగా రెండు రోజులు మూసివేస్తున్నట్లు గుంటూరు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయం తెలిపినట్లు చేబ్రోలు తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ పేర్కొన్నారు. గేట్ వద్ద ట్రాక్ లెవల్ క్రాసింగ్‌కు అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 15 వ తేదీ ఉదయం 8 గంటల నుండి 16వ తేదీ సాయంత్రం 6.00 గంటల వరకు గేట్‌ను పాక్షి కంగా మూసివేయనున్నట్లు తెలిపారు. తేలికపాటి వాహనాలు 2/3 వాహనాలకు మాత్రమే రోడ్డు ట్రాఫిక్ అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15,16 తేదీలలో భారీ వాహనాలు అనుమతించబడవని తెలిపారు. ప్రత్యామ్నాయంగా రోడ్డు ట్రాఫిక్ ఎల్ సి నెం 235 సంగంజాగర్లమూడి -శలపాడు నుండి ఉండవచ్చని అన్నారు.

కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-దుగ్గిరాల

పెన్షన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పనిలేదని ఎంపిపి దానబోయిన సంతోష రూపవాణి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యా లయంలో గురువారం మండల వ్యాప్తంగా కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం జెడ్పిటిసి మేకతోటి అరుణ, వ్యవసాయ మార్కెటింగ్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, ఎంపిడిఒ కుసుమ శ్రీదేవి మాట్లాడారు. **కాకుమాను :** మండలంలో కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు పెన్షన్లను వైస్ ఎంపీపీ కపిల్ దేవ్ అందజేశారు. కపిల్ దేవ్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కులం,మతం, పార్టీ చూడకుండా పెన్షన్లు ఇస్తున్నారని అన్నారు.

హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలో అనేక రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న జాతీయ భాష హిందీని నేర్చుకోవడం విద్యార్థులకు తప్పనిసరి అని ప్రజ్ఞ మెడి, టెక్నో పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. గురువారం జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక నగరంపాలెంలోని పాఠశాలలో విద్యార్థులకు హిందీలో వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. స్థానిక బ్రాడీపేటలోని బిహెచ్ డిగ్రీ కాలేజిలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వం, హిందీ పద్యపోటీలు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. **తెనాలి:** రూరల్ గ్రామం సంఘం జాగర్ల మూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో హిందీ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రధానో పాధ్యాయులు ఎ.శివ రామకృష్ణ మాట్లాడారు. **కాకుమాను:** మండల పరిధిలోని కొండపాటూరులోని హైస్కూల్‌లో ప్రధానో పాధ్యాయులు శీలం అంకారావు అధ్యక్షతన జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించారు. ఎంపిపి ఆర్.త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్వరలో గాంధీ పార్కు ప్రారంభం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

త్వరలో గాంధీ పార్క్ ప్రారంభించి, ప్రజలకు అందు బాటులోకి తీసుకు రానున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కమిషనర్ గాంధీ.పార్కును పరిశీలించి, త్వరలో ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరం నడిబొడ్డున ప్రజలకు ఆహ్లాదాన్ని అందించటాన్ని గాంధీపార్క్ అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. పార్కు ప్రధాన గేటులోని ఫౌంటైన్, గులాబీతోట, సెల్ఫీ పాయింట్స్, క్లాక్ టవర్, చెస్ బోర్డ్, జంగిల్ బుక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించి కొన్ని చోట్ల మొక్కలు ఎండి ఉన్నాయని వాటి స్థానంలో నూతన మొక్కలు పెంచాలని ఏడిహెచ్‌ని, సివిల్ పనులు పెండింగ్ లేకుండా శుక్రవారం నాటికి పూర్తి చేయాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. అలాగే పార్క్‌లో లైటింగ్‌ని పరిశీలించి, నిర్దేశిత ప్లాన్ మేరకు ఏర్పాటు చేసిన ప్రతి లైట్ వెలగాలని ఈ.ఈ. మరొకసారి తనిఖీ చేయాలన్నారు. పార్కింగ్‌ని పరిశీలించి వాహనాలు పార్క్ చేసిన వారు నేరుగా పార్క్‌లోకి రాకుండా, మెయిన్ గేటు ద్వారానే వచ్చేలా చూడాలని, టాయ్‌లెట్స్ కూడా పార్క్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్క్ ఎదురు ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.పర్యటనలో ఎస్.ఈ. భాస్కర్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఏడిహెచ్ రామారావు, డి.ఈ.ఈ.లు శ్రీనివాసరెడ్డి, కళ్యాణరావు, డిసిపి కోటయ్య, ఎస్.ఎస్. ఆయుబ్ ఖాన్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, టిపిఎస్ లు పాల్గొన్నారు.

పార్కును పరిశీలిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

17 నుండి ఆయుష్మాన్‌భవ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వైద్య ఆరోగ్యాధికారి కార్యాలయంలో గురువారం ఆశా నోడల్ అధికారులకు ఆయుష్మాన్‌భవ కార్యక్రమంపై డిఎంఅండ హెచ్ఒ డాక్టర్ ఎ.శ్రావణబాబు అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణబాబు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుండి ప్రారంభం అవుతున్న ఈ కార్యక్రమంలో అందర్నీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుకు నమోదు చేయించటం, కార్డులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ప్రతి శనివారం ఆయుష్మాన్ మేళా నిర్వహించాలన్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 15వ తేదీ నుండి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఏఎన్ఎం, ఆశా, వాలంటీర్ ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి, కుటుంబ సభ్యుల ఆరోగ్యం గురించి వివరాలు సేకరించటం, వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించటం చేస్తారన్నారు. కావున ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ శిక్షణలో అడిషనల్ డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ రత్నమన్మోహన్, పిడిహెచ్ఎన్ఒ శాంత కుమారి, హెచ్ఇఇఒ చంద్రశేఖర్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, డిసిఎం సురేష్ పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఒ